# గలగలా గోదారి

భైరవయ్య

"ఎవరదీ నాగన్నేనా. ఏరా మరీ నల్లపూసవై పోయావు. అలా పెరట్లోకి రారా" అన్నారు మామ్మ గారు.

"ఎందుకండీ శానా పనుందండీ. ఆకుమళ్ళ పెరువుకెళ్ళాల" అన్నాడు నాగన్న పెరటివైపు వస్తూనే.

"ఏడిశావులే. సుబ్బరాజడిగితే మామ్మగారు పిలిచా రని చెప్పు. అదిగో ఆ గుండిగలో నీళ్ళు ఆ అరటి మొక్కలకి, ఆ రామబాణాల మొక్కకి, ఆ నిమ్మ చెట్టుకి పోసి, మళ్ళీ దాన్నిండా నీళ్ళు తోడు."

"అయ్యబాబోయ్ పనుందండీ."

"చెప్పిన పని చెయ్యరా సచ్చినాడ. మినపరొట్టె

## మామ్మ గారంటే మామ్మ గారండీ

పెడతాను" అన్నారు మామ్మగారు, వంటిట్లోకి వెడుతూ.

"ఏటోనండి రొట్టెట్టడానికీ, నీళ్ళు తోడ్డానికీ సంబంధవేటండీ"

"తిన్నది అరగొద్దురా గాడిదా."

"ఏటోనండి" అంటూ చిటికెలో ఆ పని పూర్తి చేసి, అరిటాకుకోసి, నూతి చప్టామీద కూచున్నాడు నాగన్న.

అద్దాకంత మినపరొట్టె, అందుకు తగ్గ ఆవకాయ, బెల్లంముక్క ఆ ఆకులో వేసారు మామ్మగారు. వాడు దాన్ని పరిపూర్ణంగా ఆరగించాడు మామ్మగారి తిట్ల రూపంలో వున్న దీవెనలను ఆప్యాయంగా నంజుకుంటూ.

మామ్మగారి దినచర్యలో అదొక భాగం. ఒకరికి పెట్టకుండా తినలేదు ఆవిడ. ఎంత కమ్మగా పెట్టేవారో అంత కమ్మగానూ తిట్టేవారావిడ. ఆవిడ తిట్లను ఆ వూరంతా దీవెనలుగానే భావించేది. ఆవిడ చేతివంట రుచి చూడని ప్రాణి ఆ వూళ్ళో లేదన్నది పచ్చి నిజంరా అబ్బాయ్.

"మామ్మగారేం చేసేవారూ" అంటే, ఆవిడేం చెయ్యాలిరా. తనకున్నది నలుగురికీ కమ్మగా వండి పెడుతూ, ఆ వూరంతటికి కన్నతల్లిలా వుండడమే ఆవిడ చెయ్యగలిగింది. బొడ్డూడని పసివెధవ దగ్గర్నుంచి, బొడ్డుదాకా నడుం వంగిపోయిన ప్రాణి వరకూ ఆవిడ మామ్మగారే. ఆవిడ పేరేమిటో ఆ వూరు మర్చిపోయిందిరా. ఆవిడ్ని మటుకు మామ్మ గారిగానే గుర్తుంచుకుంది, గౌరవించింది. లంకంత ఇల్లు, పెద్దలు మిగిల్చిన మడిచెక్క, ఆవిడ జీవనానికి ఢోకాలేకుండా జేసాయి. కొడుకు పట్నంలో ఉద్యోగం చేస్తున్నాడు. "అక్కడొక్కర్తివి ఎందుకమ్మా" అంటే, "ఎనిమిదో ఏట ఈ గడ్డ మీద కాలెట్టాను. అయిదు పుష్కరాలు గడిచిపోయాయి. ఈ చెరువులో నీళ్ళనీ, గుళ్ళో రామలింగణ్ణి వదిలి రాలేనురా. అన్నిటి కన్నా నేను వచ్చేస్తే ఈ వూరంతా తల్లిలేని పిల్లలయి పోతార్రా అబ్బాయ్. వచ్చి చూసిపోతూ వుంటాలే. అంతేకాని, ఆ రొదలో వుండలేనురా" అనేవార్రా ఆవిడ.

ఆ వూరు ఆవిడ వూపిరి. ఆ వూరు ఆవిడ జీవితం. ఆ వూరే ఆవిడకి కాలక్షేపం. పురుడొచ్చినా, పెళ్ళి పేరంటమైనా, పరామర్శించాలన్నా మామ్మ గారు వుండాల్సిందే. మంచీ సెబ్బరా చెప్పాల్సిందే. ఏ కార్యానికైనా సరే, ఏ కూర వండాలో, ఏ పిండి వంట చెయ్యాలో, ఎంతెంత చెయ్యాలో మామ్మగారే చెప్పాలి. పెళ్ళికూతురికి చెయ్యవలసిన అలంకరణ దగ్గర్నుంచి, శోభనం గది తీర్చిదిద్దాల్సిన తీరు వరకు మామ్మగారు వుండాల్సిందే. ఆవిడెక్కడుంటే అక్కడే సందడి. ఒక విషయమూ, ఒక కబురా ఆవిడ దగ్గ రుంటే కాలం ఎలా గడిచేదో తెలిసేది కాదురా. ఎంత ధాటిగా తిట్టేవారో, అంత కమ్మగానూ ఫక్కుమని నవ్వేవారురా. కడుపునిండా ఎలా పెట్టేవారో, అంత ఇదిగానూ నోటినిండా పలకరించే వారురా అబ్బాయ్.



ఆవూరు, ఏ అరదేశి పరదేశి వచ్చినా మామ్మ గారింట విస్తరి వేసి, ఆ ఆదరణను గుండెనిండుగా అనుభవించి, ఆ అనుభూతిని తరువాతి తరం వారికి పదిలంగా అందించేవారురా


"మ్మాగారండీ ఆకలేత్తాందండీ" అని ఎవరైనా అడగడం ఆలశ్యం. ఆ అడిగినవాడు ఎవరన్నది ఆవిడకు అప్రస్తుతం. వాడి కులంతోగానీ, వాడి హోదాతో గానీ, గుణగణాలతో గానీ, సమయాసమ యాలతో కానీ, ఆవిడకి నిమిత్తం లేదు. వాడు అన్నార్తుడు అదొక్కటే ఆవిడకి తెలిసిన విషయం."

"పిచ్చినాయన ఆకలేస్తోందిరా. అలా కూచో. అరగంటలో పెడతాను. అందాకా ఈ మజ్జిగ దాహం పుచ్చుకో" అంటూ శేరు ప్రయాణంలో వున్న కంచుగ్లాసుతో గ్లాసుడు మజ్జిగా ఇచ్చేవారు. ఆ మజ్జిగెలా వుండేదనీ, చిక్కగా నవనీతంలా వుండేది. ఆ మజ్జిగని పుచ్చుకుని, ఆ రుచిని సదరు వ్యక్తి ఆసాంతం అనుభవించేలోగా భోజనం తయారయ్యేది.

వండడానికి సరుకులింట్లో వున్నాయా లేదా అన్నది ఆవిడకి పట్టేది కాదు. ఇంట్లో వుంటే, ఆ వున్నది వండి పెట్టేవారు. లేకపోతే ఆ క్షణంలో ఆవిడకెవరిమీద అనుగ్రహం కలిగితే వారింటికి వెళ్ళేవారు. "ఒరేయ్ ఆకలంటూ వచ్చాడురా పిచ్చి సన్యాసి" అనేవారు. అని, తిన్నగా వంటగదిలోకి వెళ్ళి కావలసిన సరంజామా తీసుకుని, పెరటి గుమ్మం నుంచి వంటింట్లోకి ప్రవేశించి, ఆ వస్తువులతో కమ్మగా వండిపెట్టి ఆ వచ్చిన శాల్తీ ఆకలి తీర్చి పంపేవారు. అదీరా మామ్మగారంటే.

పెద్దింటివాళ్ళు కూడా మామ్మగార్నడిగి కూర తెమ్మనమనో, పులుసు పెట్టమ్మనో పురమాయించే వారు. ఆవిడ ఇంటి తలుపులు ఎప్పుడూ తెరుచుకునే వుండేవిరా. సింహద్వారం దగ్గర తలపెట్టుకుని పడు కునే వారావిడ. తలుపులు వేసే అవసరం ఎప్పుడూ కలగలేదావిడకి. ఆవిడ పడుకుని వున్నా, కూచుని వున్నా, పనిచేసుకుంటున్నా చుట్టూ ఆడపిల్లలు, అమ్మలక్కలు గుమిగూడి వుండేవారు. ఆ ఇల్లు ఎప్పుడూ నిర్మానుష్యంగా వుండేది కాదురా. అలా గుమిగూడిన వాళ్ళందరూ ముగ్గులు నేర్చుకుం టూనో, అల్లికలల్లుతూనో, అప్పడాలు వత్తుతూనో, పిల్ళు విసురుకుంటూనో వుండేవారు. ఏ పని చేస్తున్నా అందరూ ఏదో ఒక పాట పాడాల్సిందే. సీతా కళ్యాణమో, సీతమ్మ సమర్తో, గొల్లమద్దులో, రాస క్రీడలో, అంపకాల పాటలో ఒకటేమిటి అలా సాగి పోతూ వుండాల్సిందే. ఏడాదికోసారి, ఓ నెల రోజులుండడం కోసమని కొడుకు దగ్గరకెళ్ళే వారు మామ్మగారు. ఆ నెల రోజులూ, ఆ వూరంతటికీ నీరసం ఆవహించి వుండేది. "మామ్మగారండీ వచ్చేయండీ. కావాలంటే అబ్బాయిగార్ని కూడా వచ్చేయ్యమనండీ" అంటూ వుత్తరాల మీద వుత్తరాలు వచ్చేవి. ఆవిడ్ని ఆపడం ఆ కొడుక్కి బ్రహ్మప్రళయ మయ్యేదిరా అబ్బాయ్.

ఓ సారేమయిందుకున్నావ్. ఎవడో దూరపు చుట్టం. కర్మిష్ఠి, నిత్యాగ్నిహోత్రుడు. ఏదో పనిమీద వున్న వూరు విడిచి వెళ్ళవలసివచ్చింది. అరపూటలో వచ్చేస్తా ననుకున్న వ్యక్తి, మూడు రోజులుండిపోవలసి వచ్చింది.




వెళ్ళినచోట తగిన వసతి లేకపోవడంవల్ల విస్తరి వెయ్యడం కుదరలేదు. ఆవురావురుమంటూ ఇంటిదారి పట్టాడు. మామ్మగారి వూరు చేరేసరికి అపరాహ్ణం సమీపించసాగింది. మూడు రోజుల్నించి జీవుడు శోషించి వున్న కారణంగా అడుగు తీసి అడుగు వెయ్యడం కష్టమే అయ్యింది. ఆ సమయంలో మామ్మగారు గుర్తుకు రావడం జరిగిందిరా. ఏకాఎకిన లేని సత్తువ తెచ్చుకుని మామ్మగారి గుమ్మం చేరాడు.

"ఏవిరా అబ్బాయ్ అలా వున్నావు" అనడిగారు మామ్మగారు.

"మామ్మ మూడు రోజులయింది జీవుడు కడగట్టి. కాస్త ప్రాణం పొయ్యి తల్లీ" అన్నాడు.

"పిచ్చి సన్యాసీ. అలా చెరువు కెళ్ళి, ఆ మూడు మునకలూ వేసి, ఆ రామలింగడినెత్తిమీద కాసిని నీళ్ళు జల్లి రారా అబ్బాయ్. కొదవ నేజూసుకుంటాలే" అన్నార్రా మామ్మగారు.

ఆ జీవుడటు వెళ్ళగానే, ఇటు వంట ప్రయత్నంలో పడ్డారావిడ. ఏమంత బ్రహ్మాండమైన వంటనీ, ఒక్క మనిషికాయె. అలా అడ్డెడు బియ్యం వార్చి, పెడపొయ్యి మీద తవ్వెడు కందిపప్పు వుడుకుతూ వుండగా, వీసెడు వంకాయలకు అల్లం, పచ్చిమిర్చి జోడించి కూర వుడ కేసి, పెద్దరాచిప్పడు పులుసు ఆవపకాయ ముక్కలు, చిలకడ దుంపలతో మేళవించి కిందకి దింపారు. అట కెక్కి ఎండావకాయ రెండు పూర్తికాయలు పూటలో సహా తీసి వుంచి, పెద్ద రాజుగారింటికి మనిషిని తరిమి పెద్ద సత్తుప్పాలాడు మీగడ పెరుగు, భేషైన నెయ్యి ఒక శేరు సిద్ధం చేసారు. ఆ ఆధరవులన్నీ ఆ మనవడు ఆరగించి, కడిగిన పళ్ళెంలా ఆరిటాకు వదిలేసాడు. ఆ పిదప రెండత్తాలు అమృతపాణీ అరటిపళ్ళు సంటికిందకి వేసుకున్నాడు.

"పిచ్చి సన్యాసి, ఆకలి తీరిందిరా" అనడిగిన మామ్మగారితో "చాలు మామ్మా. ఎక్కువైతే నడవడం కష్టం" అన్నాడురా ఆ జీవుడు తృప్తిగా.

"ఏం తిన్నావు రా. పిట్ట తిండీ నువ్వూను. అయినా, ఏ వంత నడకరా పట్టుమని పదికోసులుకూడా లేదాయె. అలానడుం వాల్చు. రెండు మినపరొట్టు వేసి పెడతాను. కళ తప్పి వున్నావు. కాస్త ప్రాణొస్తుంది" అంటూ అప్పటికప్పుడు శేరు మినపప్పు నానబోసి, రొట్టు కాల్చి, అందులోకి తేనె పాకం, ఆవకాయ పిండి వేసి పెట్టారు.

అదిరా మామ్మగారి ఆదరణ.

అలా ఎన్నని చెప్పమంరా విశేషాలు. ఆవిడ చేతి భోజనం చేసాక, పూచిక పుల్లలా వున్న వాళ్ళైనా మదిం చిన పోట్లగిత్తలా చిక్కబట్టాల్సిందే. ఆ వూరంతా ఒక పెద్ద విస్తరయితే, ఆ విస్తరినిండా వండి పెట్టగలిగే అన్న పూర్ణమ్మ తల్లిరా ఆవిడ. ఆవిడకి తెలిసి, ఆ చుట్టు పక్క లెవరూ ఆకలికి బాధపడలేదు. కలిగిన వాడూ, కలగని వాడూ కూడా ఆవిడ ఆదరణను ఒకలానే అనుభవిం చారురా.

అటువంటి మామ్మగారు కూడా కాలానికి లొంగక తప్పలేదురా అబ్బాయ్. ఆ స్వర్గంలో దేవతల్ని కూడా మామ్మగారి పులుసు తాలూకు గుభాళింపు నవలూరేలా చేసిందేమో.

ఆ పన్నెండు రోజులు వూరు వూరంతా మైల పట్టిందిరా. "మామ్మగారండీ మా కాకలేత్తే అన్నవేవ రెడతారండీ" అనే ఏడుపు తప్ప మరో శబ్దం వినిపించ లేదురా అబ్బాయ్.

పన్నెండో రోజున జరిగిన సంతర్పణ, ఆఫిర్కా వరి స్తలో మరుపురాని ఘట్టంరా అబ్బాయ్. వారా వీరా అని కాక, వూరంతా ఒక్కటై మామ్మగారికి సంతృప్తి కలిగేలా ఆరగించిందిరా. ఏ రోడ్డుమీద మాసినా పరచిన విస్తళ్ళే, వాటిముందు భక్తిగా, దుఃఖాన్ని అణిచిపెట్టు కుని ఆ తల్లి ప్రసాదాన్ని స్వీకరిస్తున్న పిల్లరేరా. పాటి మీద మనుషులే కాదు, పరఘు ఛాందసులే కాదు, పెద్దరాజు గారే కాదు, ఏ ఒక్కడూ కూడా మామ్మగారి ప్రసా దాన్ని తినకుండా వుండలేదురా తంబ్రీ. ఆ వూరి వాళ్ళే కాదురా. ఆ వూరుమీంచి ఆ రోజు వెళ్ళిన ఏ జీవీ కూడా మామ్మగారి ప్రసాదం అందుకోకుండానె వెళ్ళ లేదురా అబ్బాయ్.

*ఆ మామ్మగారు పోయారు. ఆ ఆదరణా పోయిందిరా. కాలంరా అబ్బాయ్... కాలం......*

రావినూతల సువర్ణాకన్నన్ * నవల గాలిగోపురం * త్వరలో ప్రారంభం